క్లుప్తంగా

కేజీబీవీల్లో ప్రవేశాలకు వినతి



ఏపీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్‌): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌ దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థినికి సీటు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమగ్ర శిక్ష అభియాన్‌ ఏపీసీ విజయజ్యోతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల అక్షరాస్యత తక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలో వారి అక్షరాస్యతను పెంచేందుకు కేజీబీవీల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీటు కేటాయించాలన్నారు. నాయకులు అమర్, సాయి, ఉదయ్‌ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్‌ అధ్యక్షుడిగా హృదయరాజు



కర్నూలు(సెంట్రల్‌): ఏపీటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలు జిల్లాకు చెందిన జి.హృదయరాజు ఎన్నికయ్యారు. గుడివాడలో జరిగిన ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కౌన్సిల్‌ సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది. కాగా, ఈయన ఏడోసారి ఎన్నికవడంతో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం హర్షం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాకు చెందిన రామకృష్ణయ్యను ఎన్నికల కమిటీ సభ్యుడిగా, తిమ్మప్పను ఆడిట్‌ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

నేడు కర్నూలు మండల మీట్‌

కర్నూలు(సెంట్రల్‌): స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు కర్నూలు మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సభ్యులతో పాటు మండల పరిషత్‌ ప్రత్యేకాధికారి, ఎంపీ, కోడుమూరు ఎమ్మెల్యే హాజరుకావాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి 28 పేజీల నోట్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్‌): కర్నూలు కార్బైడ్‌ 220 కేవీ సబ్‌స్టేషన్‌ నుంచి గూడూరు ట్రాన్స్‌కో సబ్‌ స్టేషన్‌కు వచ్చే 132 కేవీ లైన్‌ సామర్థ్యం పెంపు పనులు చేస్తున్నందున గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ వై.సుబ్బన్న తెలిపారు. నాగలాపురంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని మార్కాపురం, పెద్దపాడు 11 కేవీ ఫీడర్లలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఈ ఫీడర్ల పరిధిలోని నెరవాడ, పర్ల, మార్కాపురం, కొట్టాల తదితర గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు ఫుట్‌బాల్‌ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్‌): రాష్ట్రస్థాయి జూనియర్‌ ఫుట్‌బాల్‌ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 31వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని స్పోర్ట్స్‌ అథారిటీ ఔట్‌డోర్‌ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. బాలుర విభాగంలో 2009, 2010లో జన్మించి ఉండాలని.. అలాగే బాలికల విభాగంలో 2008–10 మధ్య జన్మించిన ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, ఫామ్‌–5, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు

కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి



ఆస్పరిలో మృతి చెందిన గొర్రెలు

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరిలో మంగళవారం రాత్రి బెల్లం నాగలింగన్నకు చెందిన 8 గొర్రెలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. నాగలింగన్న ఇంటి పక్కనే ఉన్న కాంపౌండ్‌లో 15 గొర్రెలను విడిచాడు. మంగళవారం రాత్రి కాంపౌండ్‌లోకి వెళ్లిన కుక్కలు గొర్రెలపై దాడి చేసి చంపివేశాయి. దీంతో తనకు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

1న తుగ్గలిలో భజన పోటీలు

తుగ్గలి : హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి తుగ్గలిలోని కృష్ణాపురం ఆంజనేయస్వామి ఆలయంలో భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన భజన బృందాలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు సెల్‌ 9666108793, 9032694726 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌ సతీష్‌ వ్యాస్‌
- ఢిల్లీ నుంచి వీడియో కన్ఫరెన్స్‌ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్‌ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్‌): ఎన్నికల కౌంటింగ్‌ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీనియర్‌ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌ సతీష్‌ వ్యాస్‌ జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్‌ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఫలితాలు త్వరితగతిన కచ్చితమైన విలువలతో ప్రకటించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల మార్గదర్శకాలను పాటిస్తూ ఫలితాల ప్రకటనలో జాప్యం ఉండకూడదన్నారు. కౌంటింగ్‌ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద జనాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పాసు లేకుండా ఎవరినీ అనుమతించొద్దన్నారు. పవర్‌ బ్యాంకు, పవర్‌ సేఫ్టీ పరికరాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మొదట పోస్టల్‌ బ్యాలెట్‌ లెక్కింపు చేపట్టాలని, ఆ తరువాత ఈవీఎంలను లెక్కించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ సృజన, కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్వోలు పాల్గొన్నారు.

వ్యాధినిరోధక టీకాలతో రక్షణ



బాలుడికి వ్యాక్సిన్‌ వేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్‌

కర్నూలు(హాస్పిటల్‌): స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని బుధవారపేట సచివాలయం–3లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వై. ప్రవీణ్‌ కుమార్‌ తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్‌ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని వారికి సమయానుసారంగా వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా ఎంఆర్‌–1, ఎంఆర్‌–2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలని ఆదేశించారు. ఏఎన్‌ఎం ఏపీ హెల్త్‌ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణీ వివరాలు అప్‌డేట్‌ చేయాలన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్‌మాత్రలు, పిల్లలకు ఐరన్, విటమిన్‌–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్‌ కమ్యూనిటీ మొబిలైజర్‌ ప్రసాద్‌ పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్‌): సీజనల్‌ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గడ్డ వీధిలోని యూపీహెచ్‌సీలో ప్రజలకు సీజనల్‌ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు మొదలై నీటి నిల్వలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. వీటి ద్వారా మలేరియా, డెంగీ, మెదడువాపు, ఫైలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. దోమలు పుట్టకుండా చూద్దాం ..దోమలు కుట్టకుండా చేద్దాం అనే నినాదంతో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రజలు కూడా సహకరించి దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. నీరు కలుషితం కావడం వల్ల డయేరియా, వాంతులు మొదలైన వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. కాచి చల్లార్చి, వడబోసిన నీటిని తాగాలని, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎవరికైనా జ్వరం, విరేచనాలు, వాంతులు మొదలైన లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణంలోని పాఠశాలలో 'నారాయణ' అడ్మిషన్లు



నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

- విద్యార్థి సంఘాల ఆందోళన

కర్నూలు(సెంట్రల్‌): నగరంలోని జొహరాపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న పాఠశాల పేరిట నారాయణ స్కూలు యాజమాన్యం అడ్మిషన్లను చేస్తుండడంతో విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం నుంచి పాఠశాలకు గుర్తింపు తీసుకోకుండానే అడ్మిషన్‌లు చేయడాన్ని నిరసిస్తూ ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌ మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న సమయంలోనే అడ్మిషన్‌లు చేసి నారాయణ యాజమాన్యం పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. విద్యాశాఖ అనుమతి లేకుండా అడ్మిషన్‌లు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీఓ నంబర్‌ 48 ప్రకారం నిర్మాణంలో ఉన్న పాఠశాల పేరిట అడ్మిషన్‌లను చేస్తే అస్సలు అనుమతులు ఇవ్వరాదన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న నారాయణ యాజమాన్యంపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్మమ్మవ్వ జాతరకు ముస్తాబు



లక్ష్మమ్మవ్వ నగర్‌లో విద్యుత్‌ దీపాల వెలుగులు

ఆదోని టౌన్‌: భక్తుల పాలిట ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న మహాయోగి లక్ష్మమ్మవ్వ 92వ జాతర మహోత్సవానికి భక్తులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్, అంబేడ్కర్‌నగర్‌లోని విగ్రహాలను, దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచే లక్ష్మమ్మవ్వకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రోడ్డు పొడవునా కి.మీ.కు పైగానే విద్యుత్‌ దీపాలను అలంకరించారు. ఈనెల 30న గురువారం లక్ష్మమ్మవ్వ జాతర కనులపండువగా జరగనుంది. వేలాదిగా భక్తులు పాల్గొననున్నారు. అంబేడ్కర్‌నగర్, మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్‌ ప్రాంతాల్లో గురువారం జాతర జరగనుంది. ఈ సందర్భంగా రథోత్సవం, పల్లకీ సేవ, భక్తులకు అన్నదానం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

నేడు అన్నదానం

ఆదోని అర్బన్‌: ఆదోని భక్తుల ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం సందర్భంగా గురువారం సంతపేటలోని భారతి నిలయం పాఠశాల ప్రాంగణంలో భక్తుల సాయంతో అన్నదానం నిర్వహించనున్నట్లు దాత మహర్షి విజయ్‌కుమార్‌ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నదానం చేపడుతున్నట్లు వెల్లడించారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించాలి

ఆలూరు: రైతులకు పండ్ల తోటల సాగుపై ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ప్లాంటేషన్‌ మేనేజర్‌ నందకుమార్‌ ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఓ, టీసీ, ఈసీ, కంప్యూటర్‌ ఆపరేటర్లు తదితరులతో ఏపీడీ పద్మావతి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. నందకుమార్‌ మాట్లాడుతూ.. ప్రతి మండలానికి 300 ఎకరాలలో 17 రకాలుగా పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముందుగా బోరు బావుల రైతులకు ఎంపిక చేసుకోవాలన్నారు.

హిందూమతంలో అంటరానితనానికి తావులేదు



మాట్లాడుతున్న పర్రె కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్‌): హిందూమతంలో అంటరానితనం, అస్పృశ్యతకు తావులేదని వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి పర్రె కోటేశ్వరరావు అన్నారు. కర్నూలు నగరంలోని ఇండస్‌ పాఠశాలలో మూడో రోజు భజరంగ్‌ దళ్‌ శౌర్య ప్రశిక్షణావర్గ కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. హిందూ సమాజంలో నిరుగ్మతలు, ఆచారాలు లేవన్నారు. వాటిని బలవంతంగా సమాజంలో వైరుధ్యాల కోసం సృష్టించారని, ఈ నిజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో భజరంగ్‌ దళ్‌ రాష్ట్ర కన్వీనర్‌ టి.ప్రతాప్‌ రెడ్డి, రాష్ట్ర కోకన్వీనర్‌ పోలేపల్లి సుందీప్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామ సమీపంలో బుధవారం ఓ స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. పత్తికొండ మండలం జూటూరు గ్రామానికి చెందిన సురేష్‌ అట్టికల్లు కొండల్లో రాయి కొట్టేందుకు కూలీకి వచ్చాడు. పని ముగించుకున్న సురేష్‌ స్కూటర్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా బిల్లేకల్లు నుంచి ఆస్పరి వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతని కాలికు బలమైన గాయమైంది. గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

కోలుకోలేక రైతు మృతి

దేవనకొండ: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దేవనకొండ మండలం జిల్లెడబుడకల గ్రామానికి చెందిన రైతు కొండమీది హరీష్‌చంద్ర కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. హరీష్‌చంద్ర తనకున్న 5 ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం నిమిత్తం దాదాపు రూ.12 లక్షలు దాకా అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా.. కుటుంబ సభ్యులు వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య సుజాత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ అశోక్‌ వివరాల మేరకు.. నందివర్గం గ్రామానికి చెందిన చాకలి బాలస్వామి బుధవారం రాత్రి పాణ్యం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా శ్రీనివాసనర్సరీ వద్ద అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పాణ్యం చెంచుకాలనీకి చెందిన తోట గణ, అతని భార్య ఓబులమ్మ బైక్‌పై హైవే దాటుతున్న క్రమంలో మరో బైక్‌ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో రాణించాలి



రగ్బీ క్రీడాకారులతో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్‌): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ ఔట్‌డోర్‌ స్టేడియంలో రగ్బీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీ నుంచి జూన్‌ ఒకటో తేదీ వరకు భీమిలీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలతో తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రగ్బీ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో రాణించే విద్యార్థులు వచ్చే నెల 19, 20వ తేదీల్లో మహారాష్ట్రలో జరిగే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం



శిబిరంలో మాట్లాడుతున్న సెట్కూర్‌ సీఈఓ రమణ

కర్నూలు (టౌన్‌): విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు అవసరమని సెట్కూర్‌ సీఈఓ రమణ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ ఔట్‌డోర్‌ స్టేడియంలో ఉన్న బాస్కెట్‌బాల్‌ కోర్టులో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన క్రీడాకారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో ఆసక్తి ఉన్న క్రీడల్లో పట్టు సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ.. ఉత్తమ శిక్షణ ద్వారా క్రీడాకారులు మంచి ప్రతిభ చాటాలన్నారు. శిక్షణలో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్‌ అండ్‌ లెప్రసీ అధికారి భాస్కర్‌

కర్నూలు(హాస్పిటల్‌): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న 50 మంది పెద్దలు, చిన్నారులకు జిల్లా ఎయిడ్స్‌ అండ్‌ లెప్రసీ అధికారి ఎల్‌. భాస్కర్‌ చేతుల మీదుగా బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నెం.40(ఏఆర్‌టీ సెంటర్‌)లో నేస్తం ఫర్‌ రాయలసీమ రీజియన్‌ పీపుల్‌ లివింగ్‌ విత్‌ హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌ వెల్ఫేర్‌ సొసైటీ, డిస్ట్రిక్ట్‌ లెవెల్‌ నెట్‌వర్క్‌ కేర్‌ సపోర్ట్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ఇంటర్నేషన్‌ క్యాండిల్‌ లైట్‌ మెమోరియల్‌ డే సందర్భంగా దాతలు బేతంచర్లకు చెందిన గౌరి వెంకటరామిరెడ్డి, ఇతరుల సహకారంతో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌ మాట్లాడుతూ.. ఏఆర్‌టీ సెంటర్‌లోని సిబ్బంది చాలా మంచి ఉద్దేశంతో పనిచేస్తున్నారని తెలిపారు. మందులు మధ్యలో మానేసిన వారిని రప్పించేందుకు, వైరల్‌ లోడ్‌ ఎక్కువ ఉన్న వారికి, సీడీ4 తక్కువ ఉన్న వారికి పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. మందులు వాడేవారు వారికి కేటాయించిన తేదీల్లో మందులు తీసుకెళ్లాలని చెప్పారు. రోగి క్రమంగా మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే వైద్యులకు ఆత్మసంతృప్తి లభిస్తుందని అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా బాల సంచయ్‌ కమిటీలు ఉన్నాయని, దుర్భర పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు సేవ చేసేందుకు ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. పునరావాసం, విద్య తదితర సేవలు ఉచితంగా అందిస్తాయని చెప్పారు. దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్న పిల్లల సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ కె.రాధిక, డిస్ట్రిక్ట్‌ ప్రోగ్రామ్‌ మేనేజర్‌ అలీహైదర్, ఐసీటీసీ కౌన్సిలర్‌ నాగేశ్వరరావు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సునీతకు వీడ్కోలు



న్యాయమూర్తి సునీతను సన్మానిస్తున్న జడ్జీలు, కోర్టు సిబ్బంది

కర్నూలు (లీగల్‌): ఈనెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సునీతకు బుధవారం వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు గురువారం నుంచి సెలవుల్లో వెళ్తున్నందున బుధవారమే జిల్లా కోర్టు హాలులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్‌. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏఓ నరసింహారావు, జూనియర్‌ అసిస్టెంట్‌ సి.నరసింహులు, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ సి.దేవదానంను కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్‌ సైతం ఈనెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు ప్రతిభా దేవి, జి.భూపాల్‌ రెడ్డి, పి.పాండురంగారెడ్డి, సబ్‌ జడ్జి దివాకర్, జూనియర్‌ సివిల్‌ జడ్జి జ్యోత్స్నదేవి, జిల్లా కోర్టు ఏఓ పాల్గొన్నారు.

తప్పుల తడకగా సీనియారిటీ జాబితా

ఆదోని సెంట్రల్‌: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన మున్సిపల్‌ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సామాఖ్య ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఆర్‌.గోపాల్‌రెడ్డి, వి.సురేష్‌కుమార్‌ అన్నారు. వారు బుధవారం స్థానిక కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఆదోని, నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్‌ ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు వంద మంది వివరాలు తప్పుగా ఉన్నాయన్నారు. అపాయింట్‌మెంట్‌ తేదీలు తప్పుగా ఉండడం, పాఠశాల సహాయకులుగా పదోన్నతులు పొందిన వారి పేర్లు ఇప్పటికీ జాబితాలో ఉండడం, కొందరు ఉపాధ్యాయుల పేర్లు అసలు లేకపోవడం, ఉపాధ్యాయుల కేటగిరీ, విద్యార్హతలు, పనిచేస్తున్న పాఠశాల పేరు తప్పుగా ఉండడం, మున్సిపల్‌ యాజమాన్యంలోకి వచ్చిన ఎయిడెడ్‌ ఉపాధ్యాయుల సీనియారిటీ ఇలా అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు మండల అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని, గతంలో మున్సిపల్‌ ఉపాధ్యాయులందరూ తమ సర్వీస్‌ రిజిస్టర్‌ తీసుకొని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావడం జరిగిందని, ఇప్పుడు కూడా తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడానికి మున్సిపల్‌ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాలంటూ అసౌకర్యానికి గురి చేస్తున్నారని వాపోయారు. తప్పుల తడకగా ఉన్న మున్సిపల్‌ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సరిచేసి పక్కా వివరాలతో సక్రమమైన జాబితా రూపొందించాలని డిమాండ్‌ చేశారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్‌ పరీక్షల్లో ఇద్దరు డీబార్‌

కర్నూలు(సెంట్రల్‌): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ నాలుగో సెమిస్టర్‌ పరీక్షలో బుధవారం ఇద్దరు విద్యార్థులు డీబార్‌ అయ్యారు. బనగానపల్లె కేజీఆర్‌ డిగ్రీ కాలేజీలో ఒకరు, పత్తికొండ శ్రీరాఘవేంద్ర డిగ్రీ కాలేజీలో మరో విద్యార్థి మాస్‌ కాపియింగ్‌కు పాల్పడుతుండగా అధికారులు డీబార్‌ చేశారు. కాగా నాలుగో సెమిస్టర్‌కు సంబంధించిన పరీక్షకు మొత్తం 3,709 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 350 మంది గైర్హాజరైనట్లు ఆర్‌యూ అధికారులు తెలిపారు.

ఇంటర్‌ పరీక్షలో ఒకరు డీబార్‌

కర్నూలు(సెంట్రల్‌): ఇంటర్మీడియెట్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఒకరు డీబార్‌ అయ్యారు. కర్నూలు బీక్యాంపులోని ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో మాస్‌ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని అధికారులు డీబార్‌ చేశారు. మరోవైపు మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్‌ పరీక్షకు మొత్తం 8,780 మందికి గాను 8344 మంది హాజరయ్యారు. 436 మంది గైర్హాజరయ్యారు. అలాగే రెండో సంవత్సరం పరీక్షలకు 3,076 మందికిగాను 2919 మంది పరీక్షలు రాశారు. 157 మంది హాజరు కాలేదు.